సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । 26 । మార్చి । 2023



చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్ట్

చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను ఖాజీపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.10.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. -8లో..



పశుసంవర్ధక శాఖ డీడీ అచ్చెన్న మృతిపై వీడని మిస్టరీ

పశుసంవర్ధక శాఖలో డీడీగా పనిచేస్తూ గువ్వల చెరువు వద్ద శవమై తేలిన అచ్చెన్న సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0/25.3

జిల్లాలో శనివారం 25.3 - 38.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ సహర్	ఆది (సా॥)	సోమ (ఉ॥)
కడప	6.30	5.01
ప్రొద్దుటూరు	6.28	5.04
పులివెందుల	6.33	5.06

న్యూస్‌రీల్

1185 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం భౌతికశాస్త్రం, ఆర్థికశాస్త్రం, ఒకేషనల్ పరీక్షకు సంబంధించి 1185 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 92 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 25,632 మందికిగాను 24,447 మంది హాజరయ్యారు. వైఎస్సార్ జిల్లా కడపలోని ఓ పరీక్షా కేంద్రంలో ఆర్‌ఐవో రమణరాజు ఒకరిని, వెంపల్లెలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఒకరిని డీబార్ చేశారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు ప్రకాష్, వెంకటసుబ్బయ్య, ప్రసాద్‌వర్మ జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఉపాధి కూలీల కనీస వేతనం పెంపు

కడప సిటీ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి కూలీల కనీస వేతనాన్ని మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కేంద్ర ప్రభుత్వం పెంచిందని డ్వామా పీడీ యదుభూషణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంచిన కనీస వేతనం ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానుందని చెప్పారు. ప్రస్తుతం ఉపాధి హామీ కూలీల కనీస వేతనం రూ. 257 ఉండగా, రూ.15 పెరగడంతో రూ. 272కు చేరింది. జిల్లాలో మొత్తం 2,44,819 జాబ్ కార్డులు ఉండగా, 4,51,703 మంది కూలీలు ఉన్నారు. ఇందులో యాక్టివ్ జాబ్‌కార్డులు 2,00,899 ఉండగా, 3,46,169 మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం 1,45,161 జాబ్ కార్డులకుగాను 2,34,104 మంది కూలీలకు పనులకు హాజరవుతున్నారు. వీరందరికీ అదనపు వేతనం దక్కనుంది.

రుణాల కోసం ఎస్సీలు దరఖాస్తు చేసుకోవాలి

కడప రూరల్ : జిల్లాలోని వైఎస్సార్ షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్ కడప ద్వారా 2022-23 సంవత్సరానికి షెడ్యూల్ కులాల వారికి పలు పథకాలకుగాను దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అమృత్ జలధార స్కీమ్ (ఏజేఎస్) పథకం ద్వారా బోరుబావి, బోరు మోటారు, డ్రిప్, స్ప్రింక్లర్లు తదితరాల యూనిట్ విలువపై 50 శాతం సబ్సిడీ 50 వేల వరకు మంజూరు చేస్తారన్నారు. మిగిలినది బ్యాంకు రుణమని తెలిపారు. దరఖాస్తు దారుడు 2.50 ఎకరాల భూమి కలిగి ఉండాలని, ఒకరు లేదా గ్రూపుగా ఉండవచ్చన్నారు. దరఖాస్తు దారునికి సంవత్సరాదాయం రూ. 3 లక్షలకు మించి ఉండరాదన్నారు.

25 శాతం సీట్లు రిజర్వు చేయాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1) ప్రకారం అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లల కోసం రిజర్వు చేయాల్సిందేనని డీఈఓ రాఘవరెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 488 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని, వీటన్నింటిలో 25 శాతం మేర అంటే నాలుగు వేలకు పైగా సీట్లు ఉన్నాయన్నారు. ఇందులో ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4శాతం, ఇతరులకు 6 శాతం, హెచ్ఐవీ బాధితులు, అనాథలు, దివ్యాంగులకు 5 శాతం సీట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. వచ్చే నెల 10వ తేదీ వరకు 5 నుంచి 6 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు 1వ తరగతిలో ఉచిత ప్రవేశం కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్‌సీ.ఏపీ.జీవోవీ.ఇన్/ఆర్‌టీఈ వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏవైనా ఫిర్యాదులుంటే ట్రోల్ ఫ్రీ నంబర్ 14447 లేదా 9502666864 నంబర్లలో సంప్రదించాలని డీఈఓ తెలిపారు.

నగరపాలక బడ్జెట్ ఆమోదం

- రూ.574.34 కోట్లతో అంచనాలు
- ఆమోదించిన పాలవర్గ సభ్యులు



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు (ఇన్‌సెట్) నగరపాలక బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌ను, 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.574.34 కోట్లతో రూపొందించిన బడ్జెట్ అంచనాలను కడప నగరపాలకవర్గం ఆమోదించింది. శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్ కుమార్ మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను జీహెచ్‌ఎంసీ రూల్స్ 197 సెక్షన్ ప్రకార చర్చించి సెక్షన్ 189 ప్రకారం మార్పులు, చేర్పులు చేసి ఆమోదించే అధికారం సర్వసభ్య సమావేశానికి ఉందన్నారు. ఒకసారి ర్యాటిఫై చేశాక అందులో ఎలాంటి మార్పులు చేయలేమని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలు, స్త్రీ, శిశు, వికలాంగుల సంక్షేమానికి గత బడ్జెట్‌లో నిధులు కేటాయించామని, అందులో ఎన్ని నిధులు ఖర్చు చేశారో వివరాలు తెలపాలన్నారు. కార్పొరేటర్ మగ్బూల్‌బాషా మాట్లాడుతూ మనం అత్యవసర సమావేశం నిర్వహించుకుంటున్నందున ర్యాటిఫికేషన్ అనేది ఉత్పన్నం కాదన్నారు. దీంతో మేయర్ ఆ పదాన్ని తొలగించాలని ఆదేశించారు.

- గతంలో ప్లాన్ తీసుకొని ప్లాన్ డీవియేషన్ చేసిన భవనాలకు సంబంధించి డీవియేషన్ చేసిన దానికే కాకుండా భవనం మొత్తానికి పెనాల్టీ విధించడం సరికాదని సభ్యులు పాకా సురేష్ చెప్పారు. దీనివల్ల రూ.1000 పన్ను వచ్చే వారికి రూ.8వేలు వస్తోందని తెలిపారు. మగ్బూల్‌బాషా మాట్లాడుతూ 2017లో జీఐఎస్ సర్వే చేసి 60 నుంచి 70 శాతం పన్నులు పెంచారని, 2020లో ఆస్తుల క్యాపిటల్ విలువపై పన్నుల ను సవరించారన్నారు. ఇంకా ఇంప్రూవ్ చేయడానికేమీ లేదని, రూ.46కోట్లు పన్నులు వసూలు చేసిన కమిషనర్ ప్రవీణ్‌చంద్‌ను అభినందిస్తున్నామని తెలిపారు.
- ట్రేడ్ లైసెన్సులకు సంబంధించి గత ఏడాది రూ.35లక్షలు అంచనాలు రూపొందించగా, రూ.2.57కోట్లు వసూలు చేశారని, కరోనా వల్ల రెండేళ్లు వ్యాపారాలు జరగనందున వసూలు చేయవద్దని తీర్మానాలు చేసినా ఫలితం లే దని పాకా సురేష్ అన్నారు. సచివాలయ సిబ్బంది కమిషనర్ చెప్పిందే చేస్తున్నారు తప్పా, సభ చేసిన తీర్మాణాలను పట్టించుకోవడం లేదన్నారు. మగ్బూల్‌బాషా మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్సుల్లో బకాయిలు ఉండవని, ఈ వసూళ్లు అక్రమమని ఆక్షేపించారు. కమిషనర్ టార్గెట్లు విధించడం వల్లే ఇదంతా జరుగుతోందని కార్పొరేటర్ కె. సూర్య నారాయణరావు అన్నారు.
- తన డివిజన్‌లో అడ్వర్‌టైజ్‌మెంట్ ట్యాక్స్ చెల్లించలేదని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దురుసుగా వ్యవహరించారని కార్పొరేటర్ షఫీ సభ దృష్టికి తెస్తూ, అందుకు సంబంధించిన వీడియో ప్రదర్శించారు. దీనిపై డిప్యూటీ సీఎం అంజద్‌బాషా స్పందిస్తూ ఇలా దౌర్జన్యం చేయడం పద్ధతి కాదని, ఇలాంటివి పునరావృతం కాకూడదని హెచ్చరించారు.
- డోర్ టు డోర్ కలెక్షన్ చేయని ప్రాంతాల్లో యూజర్ చార్జీలు వసూలు చేయవద్దని, ఆస్తిపన్నులు కూడా జత చేయవద్దని కార్పొరేటర్ ఎం. సుబ్బారెడ్డి సూచించారు. 25 ఏళ్లు పూర్తయిన షాపు రూముల లీజుదారుల పట్ల ఎందుకు ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నారో చెప్పాలని పాకా సురేష్ పట్టుబట్టారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ వారి లీజును రద్దు పరిచామని, స్టాండింగ్ కమిటీ ద్వారా వారిని రెన్యువల్ చేసి డిమాండ్ ఇచ్చి బకాయిలను వసూలు చేస్తామని తెలిపారు.
- నగరంలో రెండు, మూడు రోజులకు ఒకసారి కూడా తాగునీరు ఇవ్వలేకున్నామని, నీటి వనరులను పెంచుకోకుంటే ఇబ్బందులు తప్పవని మగ్బూల్ బాషా తెలపగా, దేవునికడప, పాతకడప, గౌస్ నగర్‌లో సమస్యలున్నాయని కార్పొరేటర్లు చెన్నయ్య, బాలస్వామిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు జహీర్ తెలిపారు.
- డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం సమీపంలో పార్కు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ ఎంవీ శ్రీదేవి, తన డివిజన్ పరిధిలో త్రాగునీటి సమస్యలు పరిష్కరించాలని నసీబా సుల్తానా కోరారు. మున్సిపల్ మైదానంలో గోడలు కట్టి గేట్లు పెట్టడం వల్ల పాదచారులకు, గుడికి వెళ్లే మహిళలకు ఇబ్బందిగా ఉందని కో ఆప్షన్ సభ్యురాలు పత్తిరాజేశ్వరి చెప్పారు.
- తన డివిజన్‌లో రోడ్డు విస్తరించారని, విద్యుత్ స్తంభాలు తొలగించలేదని కార్పొరేటర్ షంషీర్ తెలిపారు. సాయిపేట శ్మశానవాటికలో నీళ్లు నిలబడుతున్నాయని, మట్టివేసి అభివృద్ధి చేయాలని కార్పొరేటర్ కె. బాబు కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు ముంతాజ్‌బేగం, నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు సానపురెడ్డి శివకోటిరెడ్డి, మల్లికార్జున, బండి జయమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర నిధులను సద్వినియోగ పరుచుకుంటాం: మేయర్

కేంద్ర, రాష్ట్ర నిధులను సద్వినియోగం చేసుకొని కడపను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కడప మేయర్ కె. సురేష్‌బాబు అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి నేడు బడ్జెట్ ఆమోదించుకున్నట్లు చెప్పారు. నవంబర్, డిసెంబర్‌లో బడ్జెట్ సమావేశం పెట్టుకొని మార్చిలోపు ప్రభుత్వానికి పంపాల్సి ఉన్నా, ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండటం వల్ల ఆలస్యమైందన్నారు. సీటీపన్ను, ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, యూజర్ చార్జీలను వసూలు చేసుకొని ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని తెలిపారు.తాగునీటి సరఫరా, పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. కడప విస్తీర్ణం ఎక్కువ ఉందని, సిబ్బంది మాత్రం తక్కువగా ఉన్నారన్నారు. 250 మంది కార్మికులను అదనంగా తీసుకున్నామని చెప్పారు. నగరాభివృద్ధికి మరిన్ని నిధులు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతామని, ఆ నిధులను తీసుకొచ్చి అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.

ప్రజలతో ఘర్షణ పూరిత వాతావరణం వద్దు: డిప్యూటీ సీఎం

ప్రజలతో ఘర్షణ పూరిత వైఖరితో కాకుండా సఖ్యతగా మెలగాలని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా సూచించారు. 30వ డివిజన్‌లో అడ్వర్‌టైజ్‌మెంట్ ట్యాక్స్ చెల్లించలేదని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కత్తులు పట్టుకొని బోర్డును చించడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. గొడవలు పెట్టుకోవడానికి మనమేమీ వీధి రౌడీలం కాదు కదా...కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నవారిపై ఒత్తిడి చేయండి గానీ నాలుగువేలు, ఐదువేలు బకాయి ఉన్నవారి వద్దకు దాడికి పోయినట్లుగా పోవడం సరికాదని హితవు పలికారు. అంతిమంగా దాని ప్రభావం ప్రభుత్వంపై పడుతుందని హెచ్చరించారు. చెత్త స్వీకరించినందుకు వసూలు చేసేది చెత్త పన్ను కాదన్నారు. గతంలో కూడా దాన్ని వసూలు చేశారని, వీటిని యూజర్ చార్జీలంటారన్నారు. దీనిపై కార్పొరేటర్లు అవగాహన తెచ్చుకోవాలని సూచించారు. ఏది మురికివాడ, ఏది కాదు అనే దానిపై ప్రత్యేక సమావేశం నిర్వహించి తేల్చాలన్నారు.

సమయపాలన, సమన్వయంతోనే సుస్థిర అభివృద్ధి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్లానింగ్ కార్యదర్శి విజయ్‌కుమార్. చిత్రంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు విజయరామరాజు, గిరీషా పీఎస్ తదితరులు

రాష్ట్ర ప్లానింగ్ కార్యదర్శి విజయ్‌కుమార్

కడప సిటీ : సమయపాలన, సమన్వయంతో పనిచేస్తే సుస్థిర అభివృద్ధిలో మిలీనియం లక్ష్యాన్ని చేరుకోవచ్చని రాష్ట్ర ప్లానింగ్ కార్యదర్శి జీఎస్‌ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. 2016-30 మిలినియం సమీకృత అభివృద్ధికి, అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రపంచ వ్యాప్తంగా 8 అంశాలు, 18 లక్ష్యాలు, 56 సూచికలతో ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో రాష్ట్ర ప్రణాళికశాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్ర స్థాయి అధికారులతో సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీ-సుస్థిర అభివృద్ధి లక్ష్యం), స్పందన అర్జీల పరిష్కారాలపై ఓరియంటేషన్ సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్లానింగ్ కార్యదర్శి విజయ్‌కుమార్ హాజరయ్యారు. వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్, కడప నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, అన్నమయ్య జిల్లా నుంచి కలెక్టర్ పీఎస్ గిరీషా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఎఫ్ఓ వివేక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళికశాఖ కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం 17 అంశాలను, పలు సూచికలను నిర్దేశించిందన్నారు. సమష్టి కృషి ద్వారా పరస్పరం చర్చించుకోవడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం, వాటిని పరిష్కరించడం వంటి చర్యలు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమమే అయినా దీనిని ప్రాధాన్యతతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందన్నారు. అనంతరం ఆయా విభాగాల అధికారులు స్పందన పోర్టల్‌లో డ్యాష్‌బోర్డులో పొందుపరిచిన ఇండికేటర్లపై పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెండు జిల్లాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పులివెందుల మోడల్‌టౌన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్ సెక్రటరీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. వీటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. శనివారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మోడల్ టౌన్‌లో భాగంగా సిటీ సెంటర్, నగర వనం, నీటి ట్యాంక్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. అనంతరం మోడల్ టౌన్‌కు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె: వేంపల్లెను మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ సెక్రటరీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలోని పలు సర్కిళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పులివెందుల తరహాలో వేంపల్లె పట్టణంలోని సర్కిళ్లను డెవలప్‌మెంట్ చేయాలన్నారు. జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సివిల్ తగాదాలు ఎక్కువగా వస్తున్నాయి

ప్రతివారం వచ్చే అర్జీల్లో రెవెన్యూశాఖకు సివిల్ తగాదాలకు చెందినవే అధికంగా నమోదవుతున్నట్లు వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. ఎస్‌డీజీ లక్ష్యాలను, స్పందన అర్జీల పరిష్కారానికి అవసరమైన సూచనలు చేసే విధానంలో ఈ సమీక్షా సమావేశం ఒకప్రాధాన్యత కలిగి ఉందన్నారు. మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మూలం తెలుసుకుని పరిష్కారించడమే ముఖ్యం

స్పందన అర్జీల పరిష్కార విషయంలో సమస్య మూలం తెలుసుకుని పరిష్కారం చేయడం ముఖ్యమని అన్నమయ్య జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల సాధనకు విభిన్న ఆలోచనలు ఉంటాయన్నారు. సమస్యను గుర్తించి పరిష్కారం కోసం దృష్టి పెడితే తప్పక మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.

ముగిసిన వైవీయూ పాలకమండలి పదవీకాలం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుల పదవీకాలం ఈనెల 22వ తేదీతో ముగిసింది. దీంతో తిరిగి నూతన పాలకమండలి నియామక ప్రక్రియ కోసం ఏపీ ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు అర్హులైనవారి జాబితాను తయారు చేసి పంపించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. గత పాలకమండలిలో మహిళలకు పెద్దపీట వేసిన ప్రభుత్వం ఈసారి 50 శాతం మందిని నియమించనున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

వీసీ కోసం సెర్చ్ కమిటీ సమావేశం

వైవీయూ వీసీ పదవికి రాష్ట్రంలోని ఆచార్యులతో పాటు పొరుగు రాష్ట్రాలకు చెందిన ఆచార్యులు సైతం పోటీపడుతున్నారు. వీసీ పోస్టుకు దాదాపు 70కి పైగా దరఖాస్తులు వచ్చినట్లు విశ్వవిద్యాలయ వర్గాల విశ్వసనీయ సమాచారం. సెర్చ్ కమిటీ శనివారం విజయవాడలో సమావేశమై దరఖాస్తుల స్క్రూటినీ నిర్వహించినట్లు తెలిసింది. వీరిలో అర్హతలు కలిగిన ముగ్గురిని ప్రభుత్వ మార్గదర్శనంలో గవర్నర్/చాన్సలర్‌కు పంపనున్నారు.ఏప్రిల్‌లో వైవీయూ నూతన వీసీ నియామక ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అతివల ఆర్థికాభివృద్ధికి ఆసరా



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, తదితరులు

- మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం
- ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి
- జిల్లాలో 30,635 ఎస్‌హెచ్‌జి గ్రూపుల్లోని 2,97,020 మందికి రూ. 257.84 కోట్లు మంజూరు

కడప సిటీ : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న 'వైఎస్ ఆర్ ఆసరా'పథకం స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక ప్రగతికి బాసటగా నిలుస్తోందని ఎపిఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం నుంచి 3వ విడత వైఎస్ ఆర్ ఆసరా పథక లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ నుండి ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర సగర ఉప్పర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గానుగపెంట రమణమ్మ, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసులాజం, డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్, మెప్మా పీడీ రామ్మోహన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. దీనికి అనుగుణంగా స్వయం సహాయక సంఘాల మహిళలు ముందుకు సాగుతున్నారన్నారు. అనంతరం వీసీ హాలులో మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని 30,635 స్వయం సహాయక సంఘాల్లోని 2,97,020 మంది సభ్యులకు రూ. 257.84 కోట్లు మంజూరైంది. ఇందుకు సంబంధించిన మెగా చెక్కును అతిథులు లబ్ధిదారులకు అందజేశారు.

మూడు విడతలుగా రూ. 998.31 కోట్లు

వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో రూ. 228.88 కోట్లు, రెండో విడతలో రూ. 511.59 కోట్లు, ప్రస్తుతం మూడో విడతలో రూ. 257.84 కోట్లు మంజూరు కాగా, మొత్తం రూ. 998.31 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. డీఆర్‌డీఏ డీపీఎం రెడ్డిచర్ల ధనుంజయ, మెప్మా డీపీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇది పథకాల ప్రభుత్వం



ప్రభుత్వం అమలు చేస్తున్న చాలా పథకాలకు అర్హులుగా ఉన్నాం. ఆసరా మూడు విడతలుగా వచ్చింది. జగనన్న తోడు, జీరో వడ్డీ, ఎ మా మామయ్యకు పెన్షన్ వస్తోంది. నిజంగా ఈ ప్రభుత్వం పథకాల ప్రభుత్వం.

– జింకా సరోజ, మాధవరం-1, సిద్దవటం

కుండల వ్యాపారంతో ఉపాధి



ప్రస్తుతం కుండల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. గతంలో ఈ వ్యాపారం చేయాలంటేనే ఇబ్బందిగా ఉండేది. వైఎస్సార్ ఆసరా వచ్చిన తర్వాత సొంత డబ్బుతోనే వ్యాపారం చేస్తున్నా.

– పి.రెడ్డెమ్మ, రూకవారిపల్లె, కడప

పశుసంవర్ధక డీడీ అచ్చెన్న మృతిపై వీడని మిస్టరీ

- పలు కోణాల్లో ఉమ్మడి జిల్లాల పోలీసుల దర్యాప్తు
- సెల్‌ఫోన్ కాల్ డేటా ఆధారంగా లోతుగా విచారణ
- పోస్టుమార్టం నివేదిక ద్వారా హత్యా? ఆత్మహత్యా?నా తేల్చనున్న వైనం

కడప అర్బన్ : కడపలోని పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తూ గువ్వల చెరువు ఘాట్‌లో శవమై తేలిన అచ్చెన్న సంఘటనపై ఉమ్మడి జిల్లాల పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఒకవైపు కడప ఒన్‌టౌన్ పోలీసుల బృందం, మరోవైపు అన్నమయ్య జిల్లా రామాపురం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 12న తన ఇంటి నుంచి వెళ్లిన అచ్చెన్న చర్చికి వెళ్లి, తరువాత ఆఫీసుకు వెళ్లి వస్తానని ఇంటిలో చెప్పి వెళ్లినట్లు అతని కుమారుడు డాక్టర్ క్లింటన్ చక్రవర్తి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ తరువాత సెల్‌ఫోన్ స్విచాఫ్ వచ్చిన సమయం నుంచి పోలీసులు ఆరా తీశారు. సీసీ కెమెరాల ఫుటేజీలను కడప నుంచి రామాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గువ్వల చెరువు ఘాట్ రోడ్డు వరకు క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నారు. అలాగే ఆయన సెల్‌ఫోన్‌కు వచ్చిన కాల్స్ డేటాపై కూడా ఆరా తీస్తున్నారు. ఆయన మృతదేహం ఈనెల 24న గువ్వల చెరువు ఘాట్‌లో లభ్యమైనపుడు కుటుంబ సభ్యులను పిలిపించి నిర్ధారణ చేసిన తరువాత డాక్టర్లు వచ్చి సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం చేయించారు. తరువాత ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారు కర్నూలు జిల్లాకు ఆయన మృతదేహాన్ని తీసుకుని వెళ్లి అంత్యక్రియలను పూర్తి చేశారు. ఆయన మరణం సాధారణమైనదా? లేక ఆత్మహత్యనా? లేక హత్యకు గురయ్యాడా? అనే ప్రాథమిక విషయాలపై పోస్టుమార్టం నివేదిక రావాల్సిందేనని పోలీసులు, అధికారులు తెలియజేస్తున్నారు. అనారోగ్యంగా వుండి చనిపోతే సాధారణ మరణమని భావిస్తున్నారు. ఏది ఏమైనా అచ్చెన్న మరణానికి గల కారణంపై ఇంకా అధికారులు ఓ కొలిక్కి రాలేదని తెలుస్తోంది.

సమగ్ర విచారణ చేస్తాం: డీఎస్పీ

రామాపురం : కడప పశుసంవర్ధక శాఖలోని వెటర్నరీ పాలీక్లినిక్(వీపీసీ) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్న మృతిపై అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేపడుతామని డీఎస్పీ శ్రీధర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్డులోని కోనేటి బండల సమీపంలో శుక్రవారం అచ్చన్న(58) మృతదేహాన్ని గుర్తించామని పేర్కొన్నారు. ఆ గ్రామం వీఆర్‌ఓ కల్లూరు ఫాతిమాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుడి వద్ద గల ఆనవాల మేరకు కుటుంబీకులకు సమాచారం అందించామన్నారు. లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్, రామాపురం ఎస్‌ఐ కొండారెడ్డిలు సంఘటన స్థలానికి వైద్యులను పిలిపించి మృతదేహానికి పోస్టుమార్టం చేయించారన్నారు. మృతదేహాన్ని కుటుంబీకులకు శుక్రవారం రాత్రి అప్పగించామని వివరించారు. పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా అచ్చెన్న విధులు నిర్వహిస్తున్న సమయంలో సస్పెండ్‌కు గురయ్యారని పేర్కొన్నారు. ఆ నోటీసులు తీసుకొన్నప్పటి నుంచి మనస్తాపానికి గురైనట్లు సమాచారం ఉందన్నారు. కుటుంబీకులను, ఆ శాఖ అధికారులను విచారణ చేస్తామన్నారు.

మాకు ఎలాంటి సంబంధం లేదు

– జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ

కడప అగ్రికల్చర్ : జిల్లా బహుళార్థ పశువైద్యశాలలో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న అచ్చెన్న అదృశ్యం, మృతిపై మాకు ఎటువంటి సంబంధం లేదని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ అచ్చెన్న విడతల వారీగా ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు, ఒక డాక్టర్, ఇద్దరు కింద స్థాయి సిబ్బందిని నిబంధనలకు విరుద్ధంగా సరెండర్ చేస్తూ వారి జీతాలను నిలిపి వేసి సిబ్బందిని వేధించారని ఆమె పేర్కొన్నారు. ఏపీఎఫ్ ఆర్‌ఎస్ యాప్ నుంచి సిబ్బంది పేర్లను కూడా నిబంధనలకు వ్యతిరేకంగా తొలగించారన్నారు. ఈ విషయమై ప్రభుత్వం నియమించిన నిజ నిర్ధారణ కమిటీ రిపోర్టు మేరకు ఈ నెల 15న అచ్చెన్నను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు అందాయన్నారు. అంతకు ముందు మార్చి 12న డాక్టర్ అచ్చెన్న తన కుమార్తెతో చర్చిలో కలిసి తర్వాత కనిపించడం లేదని ఆయన కుమారుడు కడప వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కావున ఆయన అదృశ్యంపై, మృతిపై మాకు ఎటువంటి సంబంధం లేదని ఆమె తెలిపారు.

డీడీ అచ్చెన్న మృతి బాధాకరం

– వెటర్నరీ అసోసియేషన్

పశుసంవర్ధక శాఖ డీడీ అచ్చెన్న మృతి బాధాకరమని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివరామిరెడ్డి, అనిమెల్ హజ్‌బెండరీ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజీ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉద్యోగులను సరెండర్ చేయడంతోనే అసోసియేషన్ ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని వివరించారు.

- డీడీ అచ్చెన్న మృతిపై సమగ్ర విచారణ జరపాలని నేషనల్ హ్యూమన్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం కడప జిల్లా అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు.

కోర్టు ఉద్యోగులకు మొబైల్ ఫోన్‌ల పంపిణీ



మొబైల్ ఫోన్ అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి సీఎస్ మూర్తి

కడప అర్బన్ : కడపలోని జిల్లా కోర్టులో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రాసెస్ సర్వర్‌లకు జీపీఎస్ ఎనేబుల్డ్ మొబైల్ ఫోన్‌లను జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి సీ.ఎస్. మూర్తి శనివారం అందజేశారు. ఎక్కువ పారదర్శకత, సమన్ల జారీ, డెలివరీ ప్రక్రియలను వేగవంతం చేయడం కోసం రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు కోర్టు సర్వీస్ మాడ్యూల్‌తో అనుసంధానించిన అండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్‌లు ఇచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రాసెస్ సర్వర్‌లకు అందించిన ఎన్‌ఎస్‌టీఈపీ మొబైల్ యాప్‌లో కోర్టు దావా నోటీసులు, సమన్ల జారీ ప్రక్రియ ట్రాకింగ్‌ను ఎనేబుల్ చేస్తుంది. ఫీల్డ్ అసిస్టెంట్లు జీపీఎస్ లొకేషన్, తీసుకున్న వ్యక్తి ఫొటో, సంతకం, దావా నోటీసులను అక్కడికక్కడే రికార్డు చేయవచ్చు. క్యాప్చర్ చేసిన డేటా తక్షణమే కేంద్ర ఎన్‌ఎస్‌టీఈపీ అప్లికేషన్‌కు తెలియజేస్తుంది. ఎన్‌ఎస్‌టీఈపీ సర్వర్ నుంచి వెబ్ అప్లికేషన్ డేటా సంబంధిత కోర్టు సర్వర్ కంప్యూటర్‌కు పంపుతుంది. తద్వారా సమన్ల సర్వీస్ స్టేటస్‌ని ట్రాక్ చేయడానికి సంబంధిత కోర్టులకు వీలు కలుగుతుంది.

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్ట్

రూ.10.25 లక్షల బంగారు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను ఖాజీపేట పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రెండు కార్లు, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కడపలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ఖాజీపేట మండలం భూమాయపల్లి గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. దువ్వూరు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి మహమ్మద్ రఫీ అలియాస్ రఫీ అలియాస్ చరణ్, ప్రొద్దుటూరు టౌన్ వాజ్‌పేయినగర్‌లో నివాసం వుంటున్న మల్లె భరత్‌కుమార్ ప్రొద్దుటూరు నుంచి కారులో కడప వైపు వెళ్తుండగా అరెస్టు చేశారు. తిమ్మారెడ్డి మహమ్మద్ రఫీపై ఇప్పటికే 40 కేసులు నమోదై ఉండటంతో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రెండు కార్లు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. తిమ్మారెడ్డి మహమ్మద్ రఫీపై వైఎస్ఆర్ జిల్లాలో 28, కర్నూలు జిల్లాలో 8, గుంతకల్లు రైల్వేస్టేషన్ పరిధిలో రెండు, తెలంగాణలో 4 కేసులు నమోదయ్యాయి. నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్, మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రారెడ్డి, ఖాజీపేట ఎస్‌ఐ కుళ్లాయప్ప, సిబ్బందిని అభినందించి నగదు రివార్డులను జిల్లా ఎస్పీ అందజేశారు.

గండి క్షేత్రానికి రూ.6 కోట్లు మంజూరు

ఎంపీకి కృతజ్ఞతలు తెలిపిన అధికారి, పాలకమండలి



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఆలయ అధికారి, చైర్మన్

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో అభివృద్ధి పనుల కోసం మరో రూ.6.10 కోట్ల నిధులు మంజూరు చేస్తూ దేవదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సదరు ఉత్తర్వులు రెండు రోజుల క్రితం అందినట్లు గండి ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడ్డి వెల్లడించారు. జనవరి నెలలో శాశ్వత నిత్యాన్నదాన పథకం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎంపీ అవినాష్‌రెడ్డికి ఆలయ అధికారులు, పాలకమండలి వినతి పత్రం ఇచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన వెంటనే దేవదాయశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. ఈ విషయమై పులివెందులలో ఉన్న ఎంపీ అవినాష్‌రెడ్డిని చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్, రవికుమార్‌రెడ్డితో పాటు తాను కలిసి కృతజ్ఞతలు తెలియజేసినట్లు ఆలయ అధికారి ముకుందరెడ్డి వెల్లడించారు.

చంద్రబాబువి అనైతిక రాజకీయాలు

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు ఆది నుంచి అనైతిక రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆరోపించారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీకి చెందిన 23మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలను చంద్రబాబు ప్రలోభాలకు గురి చేసి కొనుగోలు చేశాడని.. మళ్లీ ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలలో కూడా వైఎస్సార్‌సీపీకి చెందిన ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేశారన్నారు. తనకు అనుకూలమైన ఎల్లో మీడియా ద్వారా నిత్యం ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తూ విషపు రాతలు రాయిస్తున్నారన్నారు. సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం పరితపిస్తుంటే, అధికారమే పరమావధిగా చంద్రబాబు నాయుడు అడ్డదారులు తొక్కుతున్నారన్నారు. చంద్రబాబు నీచ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని.. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలే చంద్రబాబుకు గట్టిగా బుద్ధి చెబుతారని ఆయన తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బీటెక్ విద్యార్థి మృతి



దిలీప్‌కుమార్‌రెడ్డి మృతదేహం

లింగాల : మండలంలోని లోపట్నూతల గ్రామంలో శనివారం విద్యుత్ షాక్‌తో బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. గ్రామానికి చెందిన వెంకట మునీంద్రారెడ్డి, గంగాదేవి ఒక్కగానొక్క కుమారుడైన అలవలపాటి దిలీప్‌కుమార్‌రెడ్డి(19) బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. వారు నూతనంగా నిర్మించుకున్న ఇంటిలో శనివారం గృహ ప్రవేశ పూజలు నిర్వహిస్తున్నారు. సత్యనారాయణస్వామి వ్రతం చేసేందుకు అవసరమైన పచ్చి కొబ్బరి కాయ తీసుకురావడానికి సమీపంలోని ఓ తోటలోకి వెళ్లాడు. కొబ్బరి చెట్టు ఎక్కేందుకు ఇనుప నిచ్చెన వేసి కాయలు కోసి దిగాడు. నిచ్చెన తీసి పెట్టేందుకు ప్రయత్నించాడు. పక్కనే ఉన్న 33 కె.వి విద్యుత్‌లైన్‌కు నిచ్చెన తగలడంతో అతను షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దిలీప్ కుమార్‌రెడ్డి నంద్యాల ఆర్‌జీఎం కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఉగాది సెలవులతోపాటు గృహ ప్రవేశ వేడుకలకు ఇంటికి వచ్చి కానరాని లోకాలకు వెళ్లాడని కుటుంబ సభ్యులు, బంధువులు రోదించారు. వారికి బీటెక్ చదువుతున్న మరో కుమార్తె ఉంది. లింగాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దిలీప్‌కుమార్‌రెడ్డి మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆటోను ఢీకొన్న లారీ

- ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



సుబ్బమ్మ (ఫైల్)

బద్వేలు అర్బన్ : బద్వేలు – మైదుకూరు రహదారిలోని చెన్నంపల్లె, తొట్టిగారిపల్లె గ్రామాల మధ్యలో శనివారం ఆటోను లారీ ఢీకొనడంతో.. ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరులోని ద్వారకనగర్‌కు చెందిన తుపాకుల సుబ్బమ్మ (52) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుండేది. బద్వేలులోని కుమ్మరికొట్టాలులో ఈమె సమీప బంధువు సరోజనమ్మ శుక్రవారం మృతి చెందడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చింది. శనివారం అంత్యక్రియలు ముగించుకుని ప్రొద్దుటూరుకు వెళ్లేందుకు తన కుమార్తె, అల్లుడు, కుమారుడుతో బస్సు కోసం వేచి ఉండగా.. ప్రొద్దుటూరు వైపు వెళుతున్న ఓ ఆటో రావడంతో అందులో ఎక్కారు. చెన్నంపల్లె దాటిన కొద్దిసేపటికి బద్వేలు వైపు వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టడంతో ముందు భాగంలో కూర్చొన్న సుబ్బమ్మ చేయి తెగిపడి తీవ్ర గాయాలపాలైంది. అలాగే అప్పటికే ఆటోలో ఉన్న మైదుకూరు పట్టణంలోని కొత్తకొట్టాలుకు చెందిన షేక్ అబ్దుల్ జబ్బార్ (63)కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఇరువురిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే సుబ్బమ్మ మృతి చెంది ఉంది. తీవ్ర గాయాలపాలైన అబ్దుల్‌జబ్బార్‌ను మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. ఘటనా స్థలాన్ని అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ కత్తివెంకటరమణ పరిశీలించి ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. మృతురాలి కుమార్తె అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

సార్వత్రిక ఎన్నికల్లో 175 స్థానాలు సాధిస్తాం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 175 స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల 21 స్థానాలకు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 17 స్థానాలను కైవసం చేసుకున్న వైఎస్సార్‌సీపీని అభినందించక పోగా.. 4 స్థానాల్లో గెలుపొందిన టీడీపీకి ఎల్లో మీడియా భజన చేస్తోందని ధ్వజమెత్తారు. చంద్రబాబు చాతుర్యం అని, టీడీపీ ఏదేదో సాధించిందని, వైఎస్సార్‌సీపీ పని అయిపోయిందని ఎల్లో మీడియా ప్రచారం చేయడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ ఒక వైపు ఉంటే, మిగిలిన పార్టీలన్నీ ఒక వైపు ఉన్నాయన్నారు. సాధారణ ఎన్నికల్లో 175 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని, అన్ని సీట్లు కై వసం చేసుకుంటామన్నారు. మరి మిగిలిన పార్టీలకి 175 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేసే దమ్ము ఉందా? అని ప్రశ్నించారు. దత్తపుత్రుడు, దుష్ట చతుష్టయం, బాబు ఎన్ని జిమ్మిక్కులు పన్నినా తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వస్తుందని జోస్యం చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫలితాలు టీడీపీకి అనుకూలంగా ఎలా వచ్చాయని విలేకరులు ప్రశ్నించగా.. ఆ సీట్లన్నీ మావి కాదని, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలవేనని, మేము కొత్తగా పోటీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

– తప్పిన ప్రమాదం



పులివెందులలో కాలిపోతున్న కారు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ఉలిమెల్ల రోడ్డు సమీపంలో షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక జయమ్మ కాలనీకి చెందిన రాజా అనే వ్యక్తి గాంధీ సర్కిల్ వద్ద టిఫిన్ చేసి, కడపకు తన కారులో వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అంతలోపే కారులో పొగలు రావడంతో ఇళ్ల మధ్యలో ఎందుకు అని ఉలిమెల్ల రోడ్డులోకి తీసుకెళ్లాడు. అక్కడికి వెళ్లి డోర్లు తెరిచేలోపు ఎక్కువ మంటలు రావడంతో కారు నుంచి బయటకు దిగేశాడు. స్థానికులు గుర్తించి కారులో మంటలు వస్తున్నాయని అగ్నిమాపక శాఖ సిబ్బందికి తెలియజేశారు. వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు మొత్తం దగ్ధమైంది. రాజా చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది.

రేబిస్ వ్యాధితో వృద్ధురాలు మృతి



పార్వతమ్మ(ఫైల్)

చాపాడు : మండలంలోని వెదురూరు గ్రామానికి చెందిన పాలగిరి పార్వతమ్మ(70) అనే వృద్ధురాలు శనివారం రేబిస్ వ్యాధితో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెదురూరు గ్రామంలో ఈ ఏడాది ఫిబ్రవరి 18న పార్వతమ్మను కుక్క కరిచింది. కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు విడతల్లో కుక్క కాటు నివారణ సూదులు వేయించారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున తలలో తిరుగుతూ అస్వస్థతకు గురి కావటంతో కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. రేబిస్ వ్యాధిగా గుర్తించిన వైద్యులు చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతురాలికి భర్త రాఘవరెడ్డి, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉంది. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళల క్రికెట్ ఎంపికలకు విశేష స్పందన

- టాలెంట్‌హంట్‌కు తరలివచ్చిన క్రీడాకారిణులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ నెట్స్‌లో శనివారం నిర్వహించిన మహిళల క్రికెట్ టాలెంట్ హంట్‌కు క్రీడాకారిణుల నుంచి విశేష స్పందన లభించింది. భారత దిగ్గజ క్రీడాకారులైన రవిశాస్త్రి, ఆర్.వి.శ్రీధర్, అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న బియాండ్ క్రికెట్ అకాడమీలో ప్రవేశాల కోసం టాలెంట్‌హంట్ నిర్వహించారు. ఈ అకాడమీలో ప్రవేశాలు పొందే క్రీడాకారిణులకు మూడు సంవత్సరాల పాటు హిందూస్థాన్ యూనివర్ లిమిటెడ్ స్కాలర్‌షిప్‌లతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించనుంది. దీంతో ఎంపికలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో క్రీడాకారిణులు హాజరయ్యారు. ఈ ఎంపికలను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ (సీఏవైడీ) అధ్యక్షుడు ఎం.భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ.రెడ్డిప్రసాద్, సౌత్‌జోన్ కన్వీనర్ పి.సంజయ్‌కుమార్‌రెడ్డి, ఉమన్ కోఆర్డినేటర్ కె. విష్ణుమోహన్‌రావు, ఎస్.అబ్దుల్ ఫరూఖ్ రెహమాన్ ప్రారంభించారు. వీరితో పాటు హిందూస్థాన్ యూనివర్ లిమిటెడ్ సభ్యులు పీఎంఎస్ రెడ్డి, ఎంజె.సాల్మన్, పి.నరేష్, జి.సునీల్‌లు విచ్చేసి ఎంపికలను పరిశీలించారు. ఎంపికలకు కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్), చెమ్ముమియాపేట గంగాభవాని స్కూల్, వికాస్‌స్కూల్, ఉర్దూ స్కూల్స్ నుంచి విద్యార్థినులు విచ్చేసి టాలెంట్ హంట్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్.ఖాజామైనుద్దీన్, సభ్యులు వై. శివప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్.ఓ.సి.నెం. 1133/2022/ఎ1, తేదీ: 25.03.2023

ప్రొద్దుటూరు పురపాలక సంఘము

బహిరంగ వేలము ప్రకటన

ప్రొద్దుటూరు పురపాలక సంఘము టి.బి. రోడ్ వై.యం.ఆర్ కాలనీ వాటర్ ట్యాంక్ దగ్గర గల మునిసిపల్ స్థలములో నూతనంగా నిర్మించిన భవనములు గుడ్‌విల్ పద్ధతిలో (వాపసు చేయబడని) జనరల్ కేటగిరి క్రింద నెలసరి బాడుగ ప్రాతిపదిక పై 5 సంవత్సరముల కాలమునకు నెలసరి బాడుగకిచ్చుటకు నెలసరి బాడుగపై తేదీ. 01.04.2023 శనివారం ఉదయం 11.00 గంటల నుండి మునిసిపల్ ఆఫీసు నందు బహిరంగవేలము జరుపబడును. వివరములు ఈ క్రింద తెలుపబడినవి.

వ.నెం.	భవనము వివరములు	కేటగిరి	వేలమునకు ముందు చెల్లించవలసిన ధరవత్తు (రూపాయలలో)	కమీషనర్/మండల రెవిన్యూ అధికారి గారిచే జారీచేయబడిన సాల్వెన్సీ ధ్రువ పత్రం(రూపాయలలో)	గుత్త కాలము
1	2		3	4	5
1	బ్లాక్ నెం. 1 (గ్రౌండ్ ఫ్లోర్ & మొదటి అంతస్థు)	జనరల్	5,00,000/-	5,00,000/-	5 సంవత్సరములు
2	బ్లాక్ నెం. 2(గ్రౌండ్ ఫ్లోర్ & మొదటి అంతస్థు)	జనరల్	5,00,000/-	5,00,000/-	

బహిరంగ వేలములోపాల్గొను పాటదారులు వేలమునకు ముందుగా పై తెలిపిన వేలపు ధరావత్తు మరియు సాల్వెన్సీ ధృవపత్రం సమర్పించి, వై.యస్.ఆర్. జిల్లా అసాధారణ గజిట్ నెం. 178/2022, తేది 07.11.2022 లోని నిబంధలకు కట్టుబడి వేలం పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

కమిషనర్, ప్రొద్దుటూరు పురపాలక సంఘం.